# పెండింగ్ పనులపై త్వరలో సమీక్ష

## ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్,జనవరి 5: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పెండింగ్ అభివృద్ధి పనులన్నీ త్వరగా ప్రారంభమయ్యేలా అధికారులతో సమీక్షా సమావేశాన్ని రెండు మూడు రోజుల్లో నిర్వహిస్తామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. జూబ్లీహిల్స్ డివిజన్ గాయత్రీహిల్స్‌కు చెందిన పలువురు కాలనీ వాసులు, బీఆర్ఎస్ నేతలు శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి సమస్యలు వివరించారు. కాలనీలో రెండు సీసీ రోడ్ల నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని, బడ్జెట్ లేకపోవడంతో కాంట్రాక్టర్లు రావడం లేదని వారు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామని,ఎన్నికల కోడ్ కారణంగా అవన్నీ నిలిచిపోయాయన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమం ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనులు ప్రారంభమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గాయత్రీనగర్ కాలనీవాసులు వెంకటేశ్ యాదవ్, శివ కొమ్మినేని,భరత్, సాంబమూర్తి, సురేష్, రాజు, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి సమస్యలు వివరిస్తున్న గాయత్రీహిల్స్ వాసులు

### ఇంటి స్థలం కోసం.. ఉద్యమకారుల దరఖాస్తులు

బన్సీలాల్‌పేట్, జనవరి 5 : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో పాల్గొన్న వారికి ఉచితంగా స్థలాలను కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో బన్సీలాల్‌పేట్ డివిజన్‌కు చెందిన పలువురు ఉద్యమకారులు ప్రజాపాలన కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు డాక్టర్ ఎం.శివకుమార్ లాల్, టి.వెంకటరమణ, వై.సురేశ్ కుమార్, ఎంఎ.ఫహీమ్, కేఎం.కృష్ణ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటుందని ఆశిస్తున్నామన్నారు.

### ముదిరాజ్‌ల రిజర్వేషన్లు ప్రకటించాలి

ఖైరతాబాద్, జనవరి 5 : లోక్‌సభ ఎన్నికల లోపే ముదిరాజ్‌ల రిజర్వేషన్ల అంశాన్ని పరిష్కరించాలని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ కోరారు. సోమాజిగూడలోని మెపా కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సురేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ మాట్లాడుతూ .. ముదిరాజ్‌లకు విద్య, ఉద్యోగ సాధికారత కోసం మెపా పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సందారం వెంకటయ్య, సత్యనారాయణ, విజయ్ కుమార్, కృష్ణయ్య, రామాంజనేయులు, వేణుగోపాల్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఖైరతాబాద్, జనవరి 5 : ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసు అధికారులు సూచిస్తున్నారు. శుక్రవారం ఖైరతాబాద్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీఐ రాజశేఖర్ నేతృత్వంలో ఎస్సైలు ప్రసాద్, వినయ్ కుమార్, సిబ్బంది పలు ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి డ్రైవరూ కచ్చితంగా యూనిఫాం ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని రకాల పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఓవర్ లోడింగ్ చేయవద్దని, నిబంధనలను అతిక్రమిస్తే మోటారు వాహన చట్టం ప్రకారం జరిమానాలు విధిస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ రాజశేఖర్

## ప్రజా పాలన సిబ్బందికి శిక్షణ

ఖైరతాబాద్, జనవరి 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా దరఖాస్తుదారుల అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో డేటా ఎంట్రీ చేసేందుకు జీహెచ్ ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. అభయహస్తంలో భాగంగా మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత తదితర పథకాలను ప్రవేశపెట్టారు. ఈ పథకాలకు గాను ప్రతిరోజూ దరఖాస్తులు వేలాదిగా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పటికప్పుడు దరఖాస్తుదారుల అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు శుక్రవారం జీహెచ్ ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో 60 మంది ఆపరేటర్లు, రిసోర్స్‌పర్సన్లు, విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అప్లికేషన్లు ఎక్కువగా వస్తుండడంతో పథకాల వారీగా వెంటనే వాటిని డేటా ఎంట్రీ ఎలా చేయాలి అనే అంశాలపై డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి శిక్షణ ఇచ్చారు.

శిక్షణ కార్యక్రమంలో సూచనలు చేస్తున్న డీసీ ప్రశాంతి

## బోయిగూడలో వైద్య శిబిరం

*పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్నారు. శుక్రవారం న్యూబోయిగూడలోని గొల్లకొమరయ్య కాలనీ కమ్యూనిటీ హాల్‌లో బోయిగూడ పట్టణ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. హాజరైన ప్రజలకు బీపీ, షుగర్, బరువు ఇతర ఆరోగ్య సమస్యలను తెలుసుకుని ఉచితంగా మందులను అందజేశామని బోయిగూడ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిఖిల, బస్తీ దవాఖాన మెడికల్ అధికారి డాక్టర్ సౌజన్య తెలిపారు.– బన్సీలాల్‌పేట్, జనవరి 5*

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బేగంపేట్ జనవరి 5: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్,టీ.పీసీసీ కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా అన్నారు. శుక్రవారం ఆమె రాంగోపాల్‌పేట్, బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ఉన్న దరఖాస్తు సెంటర్‌లను సందర్శించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోట నీలిమా మాట్లాడుతూ..కేంద్రాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహకరించాలని కోరారు.

## తాగునీరు,డ్రైనేజీ సమస్యలను పరిష్కరించండి

హిమాయత్‌నగర్,జనవరి 5: తాగునీరు,డ్రైనేజీ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని శుక్రవారం నారాయణగూడ జలమండలి కార్యాలయంలో జీఎం రామకృష్ణకు హిమాయత్ నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పొంగుతున్న డ్రైనేజీలకు మరమ్మతులు చేసి,మంచినీటి సమస్యను పరిష్కారం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జి.రామన్‌గౌడ్, మహేష్, శ్రీని వాస్, అనీష్,అభిషేక్, హితేష్,జగదీష్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో తల్లితో పాటు ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని సయ్యద్‌నగర్‌లో నివాసం ఉంటున్న అమీర్ బిన్ అవద్ కార్ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. అతడికి భార్య అఫ్రీన్ బేగం(28) కుమార్తె జువేరీ ఫాతిమా(12), ఫర్జాన్ బిన్ అమీర్(8) అనే పిల్లలున్నారు. ఈ నెల 3న ఉదయం పనిమీద అమీర్ మెహదీపట్నం వెళ్లాడు. కాసేపటికి అమీర్‌కు అతడి భార్య ఫోన్ చేసి తనకు అర్జెంట్‌గా కొంతడబ్బు కావాలని అడిగింది. తాను ఇంటికి వస్తున్నానని చెప్పిన అమీర్ గంటసేపటి తర్వాత వచ్చి చూడగా ఇంట్లో ఉండాల్సిన భార్యా పిల్లలు కనిపించలేదు. దీంతో అన్ని ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం లేకపోవడంతో శుక్రవారం అమీర్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఐపీసీ 363 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## హుక్కా సెంటర్ నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్: నిబంధనలకు విరుద్ధంగా హుక్కాసెంటర్ నిర్వహిస్తున్న వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఎల్వీ ప్రసాద్ సమీపంలోని ఇమ్రాన్ ప్లాజా భవనం పై అంతస్థులో హుక్కా సెంటర్ నడుస్తుందన్న సమాచారంతో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గోవింద్ అగర్వాల్ అనే వ్యక్తి హుక్కా సెంటర్ ఏర్పాటు చేశాడని, శ్యామల్ దాస్ అలియాస్ టోనీ(28), మహ్మద్ అఫ్రార్(19)లను పనిలో పెట్టుకుని నిబంధనలకు విరుద్ధంగా హుక్కాలు సరఫరా చేస్తున్నారని గుర్తించారు. ఈ దాడుల్లో 6 హుక్కా పాట్స్, హుక్కా ఫ్లేవర్లతో పాటు ఇతర సామగ్రిని సీజ్ చేసిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## గది తలుపులు పగులగొట్టి చోరీ

బంజారాహిల్స్: తాళం వేసిన గదిలో వస్తువులు తస్కరించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..వరంగల్ జిల్లా కొత్తగూడం గ్రామానికి చెందిన సుంకరబోయిన వెంకన్న బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని శ్రీ రాయల్ కాంధార్ అపార్ట్‌మెంట్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ అక్కడే గదిలో భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. రెండ్రోజుల క్రితం భార్య గదికి తాళం వేసి ఊరెళ్లింది. డ్యూటీలో భాగంగా వెంకన్న పార్కింగ్ ప్లేస్‌లోనే రెండ్రోజుల నుంచి నిద్రపోతున్నాడు.గురువారం ఉదయం తన గదికి రాగా తాళాలు పగులగొట్టబడి కనిపించాయి. అల్మారాలో ఉంచిన బంగారు చెవి రింగులు, రూ.10వేల నగదు, వెండి గొలుసులు, మొబైల్ ఫోన్ చోరీ అయినట్లు తేలింది. ఈ మేరకు బాధితుడు శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఉచితంగా సర్టిఫికేషన్ కోర్సుల్లో శిక్షణ

హిమాయత్‌నగర్,జనవరి5: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో సర్టిఫికేషన్ ఇంటర్న్‌షిప్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు గగన్ విహారి టూర్స్ అండ్ ట్రావెల్ సంస్థ ఫౌండర్ అజయ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం నారాయణ గూడలోని సంస్థ కార్యాలయంలో ఈ కోర్సులో శిక్షణ పొంది పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ చదివిన పేద విద్యార్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పలు కంపెనీల సహకారంతో జాతీయ,అంతర్జాతీయ విమాన సర్వీసులతో పాటు ప్రభుత్వ సంస్థలు,అన్ని వర్గాల వారికి అనువైన రీతిలో విమాన టికెట్స్,హోటల్స్ బుకింగ్ చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు 040– 35859051, 9700006679 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్,జనవరి 5: రోడ్డుపై రాకపోకలకు అడ్డంకులు ఉన్న ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని గ్రీన్ మాస్క్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. రోడ్డుకు అడ్డుగా వాహనాలు, స్టాళ్లను ఏర్పాటు చేసి రాకపోకలకు అడ్డంకులు కలిగిస్తున్న 19మంది ఫుట్‌పాత్ వ్యాపారులపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. హోటళ్లు, టీస్టాళ్లకు సంబంధించిన వాహనాలు మొత్తం రోడ్లమీదనే పార్క్ చేస్తుండడంతో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని ఫిర్యాదులు రావడంతో స్పెషల్ డ్రైవ్ చేపట్టామని అధికారులు తెలిపారు.

## సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.పురేందర్‌రెడ్డి

అమీర్‌పేట్, జనవరి 5: సనత్‌నగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.పురేందర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న బాలరాజు సీటీసీకి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారంతో ముందుకు పోతామన్నారు. హైదరాబాద్‌లో ఇంటెలిజెన్స్ విభాగం నుంచి ఆయన సనత్‌నగర్‌కు బదిలీపై వచ్చారు.

## ఆన్‌లైన్‌లో..కొత్త మోసాలు

బంజారాహిల్స్, జనవరి 5: ఆన్‌లైన్ లింక్స్‌ను క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన సైబర్ నేరగాళ్లపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్2లోని జవహర్ కాలనీలో నివాసం ఉంటున్న మహమ్మద్ జావెద్ అలీ(30) అనే యువకుడికి ఇటీవల వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. తాము పంపించే లింక్‌లను క్లిక్ చేయడం ద్వారా పార్ట్‌టైమ్ జాబ్ చేయవచ్చని, దీనికోసం డబ్బులు చెల్లిస్తామని మెసేజ్‌లో చూసిన జావెద్ అలీ తన నెంబర్‌ను రిజిస్టర్ చేసుకున్నాడు. ప్రారంభంలో 30 క్లిక్స్ పూర్తికాగానే రూ.874 చెల్లించారు. మరుసటిరోజు క్లిక్స్ చెల్లించే ఉద్యోగం కొనసాగాలంటే డిపాజిట్‌గా రూ.5 వేలు ,మరో 18వేలు చెల్లించాలని కోరారు. వారు చెప్పిన విధంగా పలుమార్లు డబ్బులు పంపించినా తనకు టాస్క్ పంపించకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


**IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE :: AT SANGAREDDY**
**I.P. No. 9 of 2023**

Between:
Golla Narender ... Petitioner
AND
TATA Capital Financial Services Pvt. Ltd and others ... Respondents

To,
1. TATA Capital Financial Services Pvt. Limited,Rep. by its Manager, Office # Plot No.3 to 6, Auto Plaza,Banjara Hills, Hyd-500034.
2. Muthoot Finance Pvt. Limited, Rep. by its Branch Manager,Office # No.3-6-2/1/1, 2nd Floor,Grandpots, Royal Mansion,Himayath Nagar, Hyd - 500029.
3. TVS Credit Services Pvt.Ltd.Rep. by its Manager,Office # 2nd & 3rd Floor, Kamala Towers, S.P. Road, Begumpet, Hyd-500016.
4. Kinara Capital Pvt. Limited,Rep. by its Branch Manager,Office # No. 1-143/5, 1st Floor,Sharadha Complex, Near Easy Buy, Chandanagar, Sherilingampally, Hyd -500050.
5. Pirmal Finance Pvt. Limited, Rep. by its Branch Manager, Office # No. 7-1-615, Imperial Towers, 616 & 167/A, Ameerpet, Hyd - 500016.
(Respondent No.1 TO 5)

**NOTICE**

Take notice that, the petitioner filed the Insolvency Petition against respondent No.1 to 5 and another and the same is stands posted to 14-02-2024at 10.30 a.m., for your appearance before the Hon'ble Senior Civil Judge at Sangareddy, hence you are hereby directed to appeareither in person or through an advocate. In default of your appearance on that day the matter will be decided on merits.

**// BY ORDER OF THE COURT //**
Sd/- **M.Sudhakar,**
Advocate, Sangareddy.